క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

ఐనవోలు : మండల కేంద్రంలోని ప్రఖ్యాత ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో దక్షిణ నైరుతి దిశలో ప్రస్తుతం ఉన్న ఎల్లమ్మ ఆలయానికి వెనుక భాగంలో దాత పర్ష సర్వేశ్వర్ యాదవ్ సహకారంతో నూతన ఆలయం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గురువారం ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం వారి ప్లాన్స్ అండ్ ఎస్టిమేట్స్ ప్రకారం రూ.30 లక్షల వ్యయంతో దాత నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రానున్న జాతరలోపు పనులు పూర్తిచేయాలని సూచించారు. పునః ప్రతిష్టాపన కార్యక్రమాలు పూర్తిచేసి జాతరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత



వేలేరు : అక్రమంగా రవాణా చేసేందుకు నిల్వ చేసిన ఐదున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అజ్మీరా సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన రేణ సత్యనారాయణ చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇంటివద్ద అక్రమంగా నిల్వ ఉంచుకున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం సత్యనారాయణ ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సోదాల్లో 11 బస్తాల్లో నిల్వ ఉంచిన సుమారు ఐదున్నర కింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు తెలిపారు. వీటి విలువ రూ.9,900 ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నడికూడ : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సక్కపల్లి గ్రామానికి చెందిన పసుల దేవక్క(35) గత మంగళవారం పరకాల నుంచి కంఠాత్మకూర్‌కు వెళ్లేందుకు అంబాల హనుమకొండ బస్సు ఎక్కింది. కంఠాత్మకూర్ వద్ద దిగేందుకు ప్రయత్నించే క్రమంలో కదులుతున్న బస్సు నుంచి ప్రమాదవశాత్తు జారిపడగా గాయాలు అయ్యాయి. దీంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



శాయంపేట : మండలంలోని సూర్యనాయక్ తండాలో లయన్స్ విజన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ గుంటోజు వెంకన్న గ్రామంలోని 70 మందికి ఉచిత కంటి పరీక్ష నిర్వహించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన 50 మందిని గుర్తించి ఉచిత కళ్లజోడు పంపిణీ చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుకు కృషిచేసిన గ్రామ యూత్ అధ్యక్షుడు జైకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు



శాయంపేట : హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య భవన్‌లో ఎంసీపీఐ (యూ), ఆర్‌ఎంపీఐ ఆధ్వర్యంలో గురువారం జరిగే జాతీయ సదస్సుకు నాయకులు ప్రైవేట్ వాహనాల్లో తరలివెళ్లారు. ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉస్మాన్, అస్రఫ్, కుసుమ రమేశ్, రాజిరెడ్డి, కొమురయ్య, రాజన్న, రంజిత్, కిషన్, భుజంగరావు, సునిల్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన నిరుపేద చేనేత కార్మికుడు చేరాల సిద్దయ్య కుటుంబానికి ఉప్పల్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు స్వర్గం రవి రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. చేనేత వృత్తి చేస్తూ మూడేళ్లుగా బ్యాంకులో దాచుకున్న రూ.40 వేలు ఇటీవల బ్యాంకు నుంచి డ్రా చేసుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఆ సొమ్మును కాజేసిన విషయం తెలిసిందే. కాగా విషయం తెలుసుకున్న స్వర్గం రవి పంపించిన రూ.5 వేలను స్థానిక పద్మశాలి కులస్తులు సిద్దయ్యకు అందజేశారు.

సమస్యలు ఫుల్.. అభివృద్ధి నిల్

- మండలం ఏర్పడి ఎనిమిదేళ్లయినా వసతుల కరువు
- అభివృద్ధికి ఆమడదూరంలో ఐనవోలు..
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఐనవోలు : హనుమకొండ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఐనవోలు మండల అభివృద్ధికి అవకాశాలు ఉన్నప్పటికీ నాయకులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో మండల అభివృద్ధి ఆమడదూరంలో ఉందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు.

ఏనిమిదేళ్లు అయినా అంతే..

మండలం ఏర్పడి ఏనిమిదేళ్లు అయినా కనీస వసతులు లేకపోవడంతో ప్రజాప్రతినిధుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. వర్ధన్నపేట నుంచి 9 గ్రామాలు, హనుమకొండ నుంచి 4 గ్రామాలు, కార్పొరేషన్‌లో విలీనమైన ఒక గ్రామం, జఫర్‌ఘడ్ మండలం నుంచి 2 గ్రామాలతో కలిపి గత ప్రభుత్వం మండలంగా ఏర్పాటు చేసింది. తర్వాత ఏర్పడిన 2 గ్రామాలతో కలిపి ప్రస్తుతం 17 గ్రామాలు, కార్పొరేషన్‌లో విలినమైన గ్రామంతో మండలం గా కొనసాగుతుంది.

మండల ఏర్పాటు వరకే..

అయితే మండలం ఏర్పాటు వరకే కృషిచేసిన ప్రజాప్రతినిధులు దాని అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలో కావాల్సినంత ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మాణానికి కృషి చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

అభివృద్ధికి అవకాశం ఉన్నా..

మండల అభివృద్ధికి అవకాశాలు ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో ఇప్పటి వరకు బస్టాండ్ ఏర్పాటు చేయలేదని, ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేసిన వారు ప్రస్తుతం తొంగి చూడడం లేదనే ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

కల్పించాల్సిన సౌకర్యాలు..

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఒక గ్రంథాలయం, పలు రకాల క్రీడలను ప్రోత్సహించేందుకు మినీ స్టేడియం ,ప్రఖ్యాత మల్లన్న ఆలయానికి అనుసందానంగా ఆధ్యాత్మిక భవనం, పార్క్, టూరిజం గెస్ట్‌హౌజ్‌తో పాటు తదితర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనం

రింగ్ రోడ్డు, ఏయిర్‌పోర్టు

ఇప్పటికే చాలా గ్రామాలు 'కుడా' పరిధిలో ఉండగా మండల పరిధిలో రింగ్‌రోడ్డు ఏర్పాటు, 8 కిలోమీటర్ల దూరంలో మామునూరు ఏయిర్‌పోర్టు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రణాళికలు చేయాలని పలువురు నాయకులు అంటున్నారు.

ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి



మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి. మేధావుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకుని మండల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలి. ప్రాధాన్యత క్రమంలో అందుకు అవసరమైన ప్రత్యేక నిధులను సమకూర్చుకునేలా స్థానిక ఎమ్మెల్యే చొరవచూపాలి

– అమరవాది సారంగపాణి, బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ఎల్కతుర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ డీఆర్డీఓ సుధీర్

ఎల్కతుర్తి : కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు కల్పిస్తున్నట్లు అడిషనల్ డీఆర్డీఓ సుధీర్ అన్నారు. భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. హార్వెస్టర్ ద్వారా కోసిన ధాన్యాన్ని కల్లాల వద్దే 17శాతం తేమ ఉండేలా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం కల్పించే మద్దతు ధర పొందాలని కోరారు. ఏగ్రేడ్ రకానికి రూ.2,320, కామన్ రకానికి రూ.2,300 చెల్లిస్తున్నట్లు చెప్పారు. సన్నరకానికి రూ.500 బోనస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఏఓ పద్మ, ఏపీఎం దేవానంద్, సీసీ సతీష్, వీఓఏలు పాల్గొన్నారు.

శాయంపేట : రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దళారీ వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఓడీసీఎంఎస్ సెంటర్ ఇన్‌చార్జ్ వాంకుడోతు చరణ్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాట్లాడారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఆత్మకూరు: వైద్య సిబ్బంది నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నాణ్యతా ప్రమాణాల రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ వినయ్‌సింగ్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్ సబ్ సెంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు సకాలంలో వైద్యం అందించడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ మేనేజర్ సాగర్, డాక్టర్ స్పందన, డాక్టర్ పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురి అరెస్ట్

కమలాపూర్ : మండలంలోని అంబాలకు చెందిన దేశిని రాజయ్య, అతని కుమారుడు దేశిని శ్రీకాంత్, కంఠాత్మకూర్‌కు చెందిన గుర్రం రాజేశ్, వంగపల్లికి చెందిన గట్టు రాకేశ్ అనే నలుగురిని రెండు వేర్వేరు దాడి కేసుల్లో గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఈనెల 5న మండలంలోని అంబాలలో ఇసుక రవాణా విషయంలో వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. కాగా బాధితులు, వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రాజయ్య, శ్రీకాంత్, రాజేశ్, రాకేశ్‌ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి కారు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తిరుపతితో పాటు మరొకరు పరారీలో ఉన్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

కేన్సర్ మహమ్మారిని తరిమేయాలి

పరకాల : ప్రపంచ వ్యాప్తంగా కేన్సర్‌తో ఎంతో మంది అమాయక ప్రజలు బలవుతున్నారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్యాన్సర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్యాన్సన్ గడ్డలు రెండు రకాలుగా ఉంటాయని, వాటిలో మాలిగ్నెంట్ క్యాన్సర్ ప్రాణంతకమని అన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశోక్‌మోరె, జంతుశాస్త్రం విభాగం హెడ్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు మహేందర్‌రావు, జగదీష్‌బాబు, సమ్మయ్య, డాక్టర్ రమేశ్, ఈశ్వర్, డాక్టర్ పావని, రాజశ్రీ, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

కులగణన సర్వేను పకడ్బందీగా చేయాలి



కమలాపూర్ : సర్వేను పరిశీలిస్తున్న రాంరెడ్డి



ఐనవోలు : స్టిక్కర్లు అంటిస్తున్న జెడ్పీసీఈఓ



సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కమలాపూర్: మండలంలో ఏ ఒక్క ఇల్లు, ఏ ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా సమగ్రంగా ఇంటింటి కుటుంబ సర్వే చేయాలని బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, కమలాపూర్ మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి ఎన్యుమరేటర్లకు సూచించారు. మండలంలోని శనిగరంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్దేశిత ప్రొఫార్మా ప్రకారం కుటుబ యజమానితో పాటు కుటుంబ సభ్యుల సమగ్ర సమాచారం సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు : కులగణన సర్వేతో సబ్బండవర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దాపూర్ గ్రామంలో కొనసాగుతున్న సర్వేను ఆయన పర్యవేక్షించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్యుమరేటర్లు ఓపిగ్గా పనిచేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సర్వేకు సహకరించి ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ నారాయణ, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీఓ విమల, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలో చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని జెడ్పీ సీఈఓ విద్యాలత పరిశీలించారు. పంథిని, పున్నేలు గ్రామాలను సందర్శించి సర్వేతీరును పర్యవేక్షించారు. ఎంపీఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు మాలతి, అశోక్ గౌడ్, అంగన్‌వాడీలు, ఎస్జీటీ టీచర్లు పాల్గొన్నారు.

దామెర : ప్రభుత్వం చేపట్టిన కులగణన ఇటింటి సర్వే మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ముమ్మరంగా కొనసాగుతుంది. ఎన్యుమరేటర్ల ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి, స్టిక్కరింగ్ చేస్తున్నారు.

నడికూడ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా ధర్మారం గ్రామంలో గురువారం ఎన్యుమరేటర్‌లు ఇంటింటికి తిరుగుతూ స్టిక్కర్లు అంటించారు.


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

దామెర : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని పులుకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి దండు భరత్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బానోతు జుమ్మునాయక్ గురువారం తెలిపారు. గతనెల 30వ తేదీన హనుమకొండ జిల్లా కేంద్రంలోని జేఎన్ఎస్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్ 14 విభాగం హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కాగా త్వరలో హుస్నాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. కార్యదర్శి హర్షం శ్రీనివాస్, ఉపాధ్యాయులు హరిందర్, మురళీధర్, రాధాకృష్ణచారి, రమాకృష్ణ, ఆనంద్, ఫిజికల్ డైరెక్టర్ జెట్టి రాజేశ్వరీ తదితరులు అభినందించారు.

మండల కన్వీనర్‌గా వెంకటేశ్

శాయంపేట : మహాజన సోషలిస్ట్ పార్టీ మండల కన్వీనర్‌గా మామిడి భాస్కర్, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా తుడుం వెంకటేశ్‌ను నియమించినట్లు మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ మంద రాజు తెలిపారు. ఈ మేరకు నియమాకపత్రాలను అందించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ ఎంఈఓకు ఘన సన్మానం



సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఐనవోలు : మండల విద్యాశాఖాధికారిగా 2021 నుంచి 2024 అక్టోబర్ వరకు విధులు నిర్వహించిన వెంకటేశ్వర్‌రావును గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ పులి ఆనందం, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మూడు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఆయన కృషి చేసినట్లు తెలిపారు. జిల్లా హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, కాంప్లెక్స్ హెచ్ఎంలు వెంకటేశ్వర్లు, విద్యావారధి జిల్లా అధ్యక్షుడు సారయ్య, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీహర్షుడు, సుధాకర్, సీఆర్పీలు రేవతి, రాజ్‌కుమార్, వసంత పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



ధర్మసాగర్ : ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ధర్మసాగర్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి రైతుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. రైతుల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి అదే రైతులను పట్టించుకోకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం సన్నాలకే బోనస్ ఇస్తామని మాట తప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా నియోజకవర్గ రైతులకు రాలేదని, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రైతుల బాధలు పట్టవని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు బొడ్డు ప్రభుదాస్, జుబేదాలాల్ మహ్మద్, కర్ర సోమిరెడ్డి, బొడ్డు ప్రతాప్, మెరుగు రాజిరెడ్డి, బండ మాధవరెడ్డి, విజయ్, కళ్లెపు రాజమణి, రమేశ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వేలేరు : మండల కేంద్రానికి చెందిన మహ్మద్ సలీమ్ అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహం వద్ద నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ గోవింద సురేష్, మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, జాని, వీరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలబిల్లుల చెల్లింపులో అవకతవకలు



పాలబిల్లు చూపుతున్న రాజు

వేలేరు : మండలంలోని లోక్యాతండాలో గల ముల్కనూరు డెయిరీ పాలకేంద్రంలో బిల్లుల చెల్లింపుల్లో నిర్వాహకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని గ్రామానికి చెందిన మురావత్ రాజు ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. తనకు 15 రోజుల పాలబిల్లు రూ.26,749 వచ్చినట్లు పాలకేంద్రం బుక్‌లో రాసిఉండగా నిర్వాహకురాలు మాత్రం తనకు రూ.20,500 మాత్రమే డబ్బులు ఇచ్చారని తెలిపాడు. తనకు ఇచ్చిన బిల్లు పాలబుక్ ఉన్న బిల్లులో తేడా ఉందని గ్రహించినట్లు తెలిపాడు. ఇలా ఎందకు ఉందని నిర్వాహకురాలిని అడిగినందుకు తనపై దాడికి పాల్పడడమే కాకుండా తనపైనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వాపోయాడు. ఇప్పటికైనా ముల్కనూరు డెయిరీ నిర్వాహకులు గ్రామంలోని పాలకేంద్రంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేపట్టి చేతివాటం ప్రదర్శిస్తున్న నిర్వాహకురాలిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశాడు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న సీఐ పులి రమేశ్



వేలేరు : మాట్లాడుతున్న ఎస్సై సురేష్

ఎల్కతుర్తి : సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సీఐ పులి రమేశ్ అన్నారు. భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రాంగణంలో గురువారం విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు కొత్తనంబర్ నుంచి ఫోన్‌చేసి బ్యాంక్ ఖాతా నంబర్, ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పొదన్నారు. ఓటీపీ, ఇతర వివరాలు చెప్పిన వెంటనే బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బులు మాయమయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైతం సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటర్‌నెట్‌ను మంచికోసమే ఉపయోగించాలని సూచించారు. చదువుపై శ్రద్ధ వహించి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయిబాబు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అజ్మీరా సురేష్ సూచించారు. గురువారం గొల్లకిష్టంపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలలో సైబర్ జాగరూకత దివాస్ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, ఓటీటీ ఫ్రాడ్స్, లోన్‌యాప్స్ వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సఖీ సెంటర్ అధికారి హారిక, అడ్వకేట్ శ్రీదేవి, ఎస్ఓ స్రవంతి పాల్గొన్నారు.

అన్ని బ్యాంక్‌లు ఒకే వడ్డీరేటు అమలు చేయాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

కమలాపూర్ : మహిళా సంఘాలకు మంజూరు చేసే రుణాలపై అన్ని బ్యాంక్‌లు ఒకే విధమైన వడ్డీరేటు అమలు చేయాలని మండలంలోని సాయికృప మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంద సుజాత కోరారు. హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సెర్ప్ సీఈఓ దివ్యరాజన్, బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలపై వడ్డీ తగ్గించాలని, డాక్యుమెంట్, ఇన్‌స్పెక్షన్, ఇతర చార్జీలు, అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల్లో జీఎస్టీ, సీజీఎస్టీ తొలగించాలని కోరారు. వ్యాపారాలు చేసుకునే మహిళలకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని, ప్రతీ ఆరు నెలలకోసారి వీఎల్ఆర్ (రుణాలపై విధించే వడ్డీ)ని విడుదల చేయాలని కోరారు.

పేదలకు అండగా ఎర్రజెండా..

సీపీఎం జిల్లా కార్యదర్శి చక్రపాణి

ఎల్కతుర్తి : పేదల పక్షాన ఎర్రజెండా ఎళ్లప్పుడు అండగా ఉంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. మండల కేంద్రంలోని సుందరయ్య భవనంలో గురువారం సీపీఎం సమావేశం జరిగింది. అంతకుముందు బస్టాండ్ నుంచి సుదరయ్య కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీపీఎం నాయకులు నిరుపేదల సమస్యలు తెలుసుకొని వారికి అండగా నిలుస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం పెత్తందార్లకు కొమ్ముకాస్తు పేదల నడ్డీ విరుస్తుందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు పర్చాలని డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2500, వృద్ధులకు రూ.4వేల పింఛన్, వికలాంగులకు రూ.6వేల పింఛన్ అందించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. జిల్లా కమిటీ సభ్యులు రాములు, స్వరూప, స్వరూపతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దామెర : పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 25 మంది బాధితులకు 7,10,500 విలువచేసే చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.